

కథా కౌముది

# రేపటి ప్రేమకు నీరు పోద్దాం..

లక్ష్మీ గాయత్రి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
### సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

జన్మభూమి ఎక్స్ ప్రెస్ కదలడానికి సిద్ధంగా ఉంది. ఐదేళ్ల లహరి ఆనందంగా కిటికీ లోంచి బైటికి చూస్తోంది. పక్కనే కూచున్న పద్మ, భర్త వైపు చూస్తూ "ఈసారి సెలవులు బాగా వచ్చాయి. లేకపోతే పండక్కి మూడు రోజుల ముందు ఎప్పుడైనా వెళ్లామా" అంటూ ఆనందంగా నవ్వింది.

శివానంద్ కూడా నవ్వాడు. నవ్వాలి...లేకపోతే పద్మ ఊరుకోదు! మరి కొన్ని గంటల్లో పుట్టింటికి వెళ్లబోయే ఆనందంతో తలమునకలవుతోందామె...భర్త ఆనందం..ఆక్రోశం గురించి ఏమాత్రం పట్టనంతగా! ఆ ఆనందానికి ఏ మాత్రం విఘాతం కలిగినా సహించలేదు!!

"అన్నట్టు, పేపర్ కొనుక్కుందామనుకుంటూ మర్చిపోయాను. ఇప్పుడే వస్తాను."

శివానంద్ గబుక్కున లేచి, పద్మ వారించే లోపునే గబగబా నాలుగడుగులు వేసేశాడు.

అతను వెళ్లిన పది క్షణాలకల్లా రైలు కదిలింది. మరో పది క్షణాల్లో వేగం పుంజుకుంది.

రైలు కదలగానే ఖంగారు పడ్డ పద్మ, బండి వేగం పుంజుకున్నా భర్త రాకపోవడంతో మరింత గాభరా పడింది. ఒక్క క్షణం ఏమీ తోచలేదు. ఈ లోపల మిగతా ప్రయాణీకులు "ఫర్వాలేదమ్మా..అందిన కంపార్ట్ మెంట్లో ఎక్కేసి ఉంటారు. వచ్చేస్తార్లే" అంటూ అనునయించారు.

పద్మ కూడా అలాగే అనుకుంది. పక్క కంపార్టుమెంట్ లో ఎక్కి, లోపలి నుంచీ నడుచుకుంటూ వచ్చేస్తాడని కాస్సేపు ఎదురు చూసింది. కాని పావుగంట దాటినా శివానంద్ జాడ లేకపోయేసరికి ఆమె ఖంగారు పెరిగింది. భయంతో కళ్లలోకి నీళ్లు కూడా వచ్చేశాయి. ఆ సరికి సహ ప్రయాణికులు కూడా "ఫోనుందా నీ దగ్గర?! ఫోన్ చేసి చూడు" అనేసరికి మొద్దుబారిన బుర్రకి ఒక్కసారిగా చైతన్యం వచ్చి, గబుక్కున తన సెల్ తీసి భర్త కి కాల్ చేసింది.

ఆ కాల్ కోసమే ఎదురు చూస్తున్నట్టు ఒక్క రింగ్ కే ఫోన్ లిఫ్ట్ చేశాడు శివానంద్. అటునుంచి భర్త చెప్పింది వింటూనే పద్మ మొహం ముందు పాలిపోయింది. తర్వాత కోపంతో ఎర్రబడింది. చివరికి ఫోన్ ఆఫ్ చేసి, సర్దుకుని కూచుంది.

తండ్రి రాకపోవడం, తల్లి ఖంగారు.. అంతా చూసి బిక్కమొహం వేసిన లహరి, తల్లి ఫోన్ పెట్టెయ్యగానే, "డాడీ ఏరి మమ్మీ?" అంటూ అడిగింది.

పద్మ చిరునవ్వు మొహాన పులుముకుంది. "అర్జెంటు పని ఉంది, రమ్మని ఆఫీసు నుంచి ఫోన్ వచ్చిందిట. డాడీ వెళ్లేరు. తర్వాత వస్తారు." అంది

లహరి అసంతృప్తిగా కిటికీ వైపు తిరిగింది.

పద్మ కోపాన్ని దిగమింగుతూ, సెల్ లోకి మొహం తిప్పుకుంది.

★★★★★★★★★★★

కూతురు, మనవరాలు ఇద్దరే రావడం చూసి, పద్మ తల్లీ తండ్రీ ఆశ్చర్యపోతూ,
"అల్లుడేడీ?" అంటూ గుమ్మంలోనే ప్రశ్నించారు.

"ఏదో అర్జెంటు పని తగిలిందని ఆగిపోయారు. తర్వాత వస్తారు." అంది పద్మ ముభావంగా.

కూతురి మొహం చూసి అది అసత్యపు సమాధానమని పెద్దవాళ్లిద్దరూ గ్రహించారు. పసిదాని ముందు బయటపడటం ఇష్టం లేక వాళ్లు కూడా గుంభనగానే ఉండిపోయారు.

భోజనాలయాయి. ప్రయాణం కోసం తెల్లవారుజామునే లేచిన లహరి, అన్నం తింటూనే నిద్రపోయింది. మిగతా ముగ్గురూ కూడా విశ్రాంతిగా కూర్చున్నాక, ఒక్కసారిగా భగ్గుమంది పద్మ.

"ఆయన పండక్కి ఇక్కడికి రారు నాన్నా. ముందుగా చెబితే నేను ఒప్పుకోనని, ఆఖరి క్షణం వరకూ మాతో వస్తున్నట్టే నటించి, రైలు కదలబోతుండగా దిగి వెళ్లిపోయారు. పండక్కి మాదుగుల వెళుతున్నారు." అంది

పద్మ తల్లీ తండ్రీ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

★★★★★★★★

రామానంద్ కి పదిహేనేళ్ల వయసులో, తన ముప్పై ఎనిమిదో ఏట మళ్లీ గర్భవతి అయింది జానకి. ఇన్నాళ్లూ ఒకడే బిడ్డ అన్న అసంతృప్తి ఇప్పుడు ఎదిగిన కొడుకు ముందు ఇంత పొట్ట వేసుకుని తిరగడమా అన్న సిగ్గుగా పరిణమించింది.

"అబార్షన్ చేయించేసుకుంటానండీ" అంది తెగించి.

దశరథరామయ్య ఒప్పుకోలేదు. వ్యవసాయదారుడైన అతనికి తన కొడుకు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చెయ్యాలని ప్రగాఢమైన కోరిక. రామానంద్ కి చదువు అబ్బడం లేదు.

పొలానికి వెళ్లడమంటే ఉన్న ఇష్టం, ఆనందం ఆ కుర్రాడికి పుస్తకం పట్టుకోవడంలో లేదు.

"పెద్దోడికి ఎటూ చదువబ్బడం లేదు. చిన్నోడు బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తాడేమో." అన్నాడతను ఆశగా.

"బావుంది. మళ్లీ మొగపిల్లాడే అని ఏముంది? ఆడపిల్ల పుడితే..?!"

"పుట్టనీ. మాలక్ష్మి వస్తానంటే ఒద్దంటావా?! నా తల్లిని ఒద్దిగ్గా పెంచి, పదేనేళ్లకల్లా పెళ్లి చేసేసి, తాతనవుతా" దశరథరామయ్య మరింత సంబరపడ్డాడు.

అక్కడితో ఊరుకోకుండా, కొడుకుని పట్టుకుని, "ఒరే రామూ, నీకు తమ్ముడో, చెల్లో ఉంటే బావుంటుందా" అని అడిగాడు.

తండ్రి ప్రశ్నకి రామానంద్ మొహంలో ఆశ్చర్యానికి బదులు ఉవ్వెత్తుగా ఉత్సాహం,
ఆనందం చూసి జానకీ, దశరథరామయ్యా ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

"చాలా బావుంటుంది నాన్నా. తమ్ముడు నా కంటే బాగా చదువుకుంటాడు. వాణ్ణి డాక్టర్ చదివిద్దాం" అన్నాడు సంతోషంగా

భార్యాభర్తలిద్దరూ మొహాలు చూసుకున్నారు!

"గోపిలా నేను కూడా తమ్ముణ్ణి సైకిల్ మీద కూచోబెట్టుకుని తీసికెళ్తా" రాము ఇంకా సంతోషపు మైకంలోనే ఉన్నాడు.

పైకి చెప్పలేదు గానీ రామూ ఒంటరిగా ఫీలవుతున్నాడని భార్యాభర్తలిద్దరికీ అర్థమైంది.

దశరథరామయ్య అప్రయత్నంగా, "తమ్ముణ్ణి బాగా చదివిస్తాం సరే గాని వాడు పెద్దవాడయేసరికి నేను ముసలాణ్ణి అయిపోతాన్రా... " అన్నాడు

"అయితే ఏమైంది నాన్నా, నేనింక చదవనని ముందే చెప్పాను కదా... వ్యవసాయం పనులూ తమ్ముడి పనులూ నేను చూసుకుంటా. నువ్వూ అమ్మా హాయిగా కూచోండి" అన్నాడు రాము అదే ఉత్సాహంతో.

ఈసారి భార్యాభర్తలిద్దరికీ కళ్లంట ఆనందబాష్పాలే వచ్చాయి. తనంత ఎత్తు ఎదిగిన కొడుకుని గుండెలకి హత్తుకుని,వాడి భుజం మీద తలాన్చుకున్నాడు దశరథరామయ్య. తండ్రీ కొడుకులిద్దర్నీ చూస్తూ మనసులోనే వెయ్యి దేవుళ్లకి మొక్కింది జానకి. తనకి ఎంత కష్టమైనా పెద్ద కొడుకు కోసం మరో బిడ్డని కనాలన్న నిర్ణయానికి వచ్చింది.

రామానంద్, దశరథరామయ్యా కోరుకున్నట్టు మళ్లీ మగపిల్లాడే పుట్టాడు.

పాలబుగ్గలతో ముద్దులు మూటగడుతున్న పదహారు రోజుల చిన్న కొడుకుని నూనూగు మీసాలతో పెద్దరికం పుంజుకుంటున్న పదహారేళ్ల పెద్దకొడుకు ఒళ్లో పడుకోబెట్టి, "తమ్ముడికి నీకు నచ్చిన పేరు పెట్టుకో" అంది జానకి మురిపెంగా

"ఎప్పుడో పెట్టేశాగా పేరు" తమ్ముడి పాలబుగ్గల్ని మృదువుగా నిమురుతూ అన్నాడు రాము.

"అవునా.. " జానకి ఆశ్చర్యపోయింది. "ఏం పేరు?"

"నేను రామానంద్... తమ్ముడు శివానంద్"

★★★★★★★

"దొండకాయ కూర నాకొద్దు. నాకసలు అన్నమే వద్దు." ఎనిమిదేళ్ల శివానంద్ కోపంగా లేచిపోయాడు.

కొడుకుని బుజ్జగించడానికి జానకి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు.

అంతా చూస్తున్న కొత్త కోడలు సీత చప్పున ముందుకొచ్చి అత్తగారి చేతిలో కంచం తను తీసుకుంటూ, "అది సరే గానీ శివా, లాంతరు రుద్దితే వచ్చే భూతం గురించి విన్నావా నువ్వు" అంది

" లాంతరు రుద్దితే భూతమా... ?"

"ఆఁ... వినలేదా.. అలా కూచో చెప్తాను"

ఆ క్షణం నుంచి శివానంద్ కి తల్లితో పని లేకుండా పోయింది.

అన్నం పెట్టాలంటే వదిన.. కుంకుడుకాయ రసంతో తల రుద్దాలంటే వదిన...జ్వరం వచ్చి మాత్ర మింగాలంటే వదిన..!!

"మేనగోడల్ని కోడలు చేసుకోవడం ఎంత మంచిదైందో... పరాయి పిల్లయితే ఇంత అభిమానంగా చూసేదా.. " రోజుకోసారైనా అనుకునేది జానకి.

తండ్రి చేతుల్లోంచి వ్యవసాయం కొడుకు చేతుల్లోకీ... అత్తగారి చేతిలోంచి ఇంటి పెత్తనం కోడలి చేతిలోకీ బదిలీ అయాయి. శివానంద్ కి ఇప్పుడు ఇద్దరు నాన్నలు.. ఇద్దరు అమ్మలు!

తొలిచూలు బిడ్డ పురిట్లోనే పోయాడు సీతకి! ఏడుస్తున్న కోడలి చేతికి శివానంద్ ని అందించింది జానకి.

" వీడు నీ బిడ్డే అనుకో సీతా. ఏడవకు. మళ్లీ ఏడాది తిరిగేసరికి మరో పిల్లాడు పుడతాడు." అంది

బిక్కమొహం వేసుకుని చూస్తున్న శివానంద్ ని ఆర్తిగా గుండెలకు హత్తుకుంది సీత.

జానకి అన్నట్లు మళ్లీ ఏడాది తిరిగేసరికి మరో బిడ్డ పుట్టాడు సీతకి. కాని వాడూ దక్కలేదు.

రెండో బిడ్డ పోయిన నెల్లాళ్లకు పట్నం వెళ్లినట్టే వెళ్లి ఆపరేషన్ చేయించేసుకుని వచ్చాడు రాము.

"పిల్లలు లేకపోయినా పర్వాలేదు గాని పిల్లల కోసం సీత ఆరోగ్యాన్ని బలి చెయ్యలేను" అన్న రాము మాటకి ఇంట్లో ఎవ్వరూ నోరెత్తలేకపోయారు. ఆ తర్వాత శివానంద్ పూర్తిగా వదిన బిడ్డే అయిపోయాడు. మరో ఐదేళ్లు తిరిగేసరికి పాముకాటుతో దశరథరామయ్యా, భర్త మరణానికి కృంగిపోయి జానకీ ఈ లోకంలోంచి వెళ్లిపోవడంతో

పద్ధెనిమిదేళ్ల శివానంద్ కి అన్నావదినలే తల్లిదండ్రులయారు.

★★★★★★★★★★★★★★★★★★★★

"అతనికి అన్నా వదినా అంటే చాలా అభిమానమని నీకు తెలుసు. వాళ్లకా ఇతను తప్ప ఎవరూ లేరు. అటువంటప్పుడు నువ్వు కాస్త అటువైపు కూడా ఉండాలి కదమ్మా" మృదువుగానే అన్నాడు పద్మ తండ్రి రంగారావు

"చాల్లెండీ. అందుకని పిల్లని పండక్కి మన దగ్గరకి రావడం మానేసి మాడుగుల పొమ్మంటారా?! మనకి మాత్రం ఎవరున్నారు ఈ పిల్ల తప్ప?!" శాంత కూతురి తరపున వకాల్తా తీసుకుని మొగుడి మీద గయ్ మంది

రంగారావు మాట్లాడలేదు. ఎప్పటిలాగే మనసులో "నీకు శాంత అని పేరు పెట్టి మీవాళ్లు ఎంత తప్పు చేశారో గదా" అనుకుని ఊరుకున్నాడు

"అతను రాకపోతే మానెయ్యమనండి. అన్నావదినా దగ్గరే పండగ ఘాంఘామ్మని జరుపుకోమనండి. మన పిల్ల మనింటికి వస్తుంది. అన్నావదిన మీదే అతనికి అంత కారిపోతుంటే కన్నవాళ్లం మన మీద మన పిల్లకి ఉండదూ?! అర్థం చేసుకోకపోతే అతని ఖర్మ." శాంత నిర్ద్వంద్వంగా తేల్చేసింది.

★★★★★★★★★★★★★★★★★★

మావయ్య గారూ, నమస్కారం!

ఈపాటికి మీకు విషయం అంతా తెలిసే ఉంటుంది.

మీ ఒక్కగానొక్క పిల్ల మీద నేను ఏం చెప్పినా మీరు బాధ పడతారని ఇన్నాళ్లూ నేను నోరెత్తలేదు. కాని నా సహనం అంతరించిపోయింది. ఇక భరించలేని స్థితిలో నేను తెగిస్తున్నాను.

మా అన్నయ్య నా కంటే పదహారేళ్లు పెద్దవాడు. నాకు ముద్దుగా శివానంద్ అని పేరు పెట్టింది మా అన్నయ్యే. పేరు దగ్గర్నించీ ఇద్దరం ఒక్కటిగా బతుకుతూ మొత్తం సృష్టిలో ఆనందాన్నంతటినీ స్వంతం చేసుకుంటామని అనుకున్నాడు కాబోలు... తన పేరుతో జత కలిసేలా నాకు పేరు పెట్టాడు. మా అమ్మా నాన్నా బతికి ఉన్నా, పుట్టిందగ్గర్నించీ నన్ను కంటికి రెప్పలా చూసుకుంటూ పెంచింది మా అన్నయ్యే. అమ్మా నాన్నా పోయాక, నేనెక్కడ బెంగటిల్లిపోతానో అని నాకిష్టమైనవన్నీ వండి తినిపిస్తూ వదినా, నన్ను తన పక్కనే పడుకోబెట్టుకుని అన్నయ్యా... అసలు నాకు తల్లిదండ్రులు లేరనీ, చచ్చిపోయారనీ నేనెప్పుడూ అనుకోలేదు.. అనుకోను!

రామానంద్ మా నాన్న. మా అమ్మ పేరు సీత. వాళ్లకి నేనొక్కణ్ణే సంతానం. అంతే!!

ఎవరినైనా దత్తత చేసుకోమని అన్నయ్యకీ వదినకీ చాలా మంది చాలాసార్లు చెప్పారు. కానీ వాళ్లు ఒప్పుకోలేదు. రక్తం పంచుకు పుట్టిన శివా ఉండగా, ఎవరో ముక్కూ మొహం తెలియని వాళ్లని తెచ్చి కొత్తగా పట్టం గట్టడం దేనికీ అనుకున్నారు. రక్తం ధారపోసి, ఉన్న ఆస్తిపాస్తుల్ని ఇబ్బడిముబ్బడిగా పెంచి నాకు కట్టబెడదామన్నదే నాడూ నేడూ కూడా వాళ్ల ఆలోచన.

ఇదీ మా అన్నయ్యకీ నాకూ ఉన్న అనుబంధం. దీని గురించి మీ అమ్మాయికి మా పెళ్లయిన ఈ ఆరేళ్లలో కనీసం ఆరుకోట్ల సార్లు చెప్పి ఉంటాను. గత ఆరు నెలల నుంచీ మాత్రం ఈ విషయం మాట్లాడ్డం పూర్తిగా మానేశాను. తన ఎదురుదాడి ఫలించి నేను పూర్తిగా తన దారిలోకి వచ్చేశానని అనుకున్నట్టుంది... చాలా ఆనందంగా ఉంది.

మొగుడి మౌనం వెనుక రగులుతున్న ఆవేదన, కాస్తో కూస్తో మొహంలో ప్రతిఫలిస్తున్నా గ్రహించని.. గ్రహించినా పట్టించుకోని గొప్పది మీ అమ్మాయి!

నేను తన దార్లోకి వచ్చానని కాబోలు ఈ మధ్య కొత్త పాట ప్రారంభించింది..ఆస్తిలో నా వంతు పంచి ఇవ్వమని మా అన్నయ్యని అడగాలిట. ఆ వంతు అమ్మేసి మంచి ఫ్లాట్ తీసుకోవాలిట! వాళ్లు పోయాక ఎటూ వాళ్ల వంతు కూడా వస్తుందిగా! అప్పుడు మరో ఇల్లు కొనుక్కుంటుంది కాబోలు!!

"వాళ్లు బతికి ఉండగా వాటాల ప్రసక్తి లేదు. మరో నాలుగైదేళ్లు పోయాక ఎటూ పొలాలు కౌలుకిచ్చి వాళ్లని నా దగ్గరికి తెచ్చుకుంటాను." అన్నాను కావాలనే.

మీ అమ్మాయి మనసేవిటో పూర్తిగా గ్రహించాలనే.

"చాల్లెండి. అత్తగారు, మావగారు అంటే ఇంకా ఏమో...! బావగార్నీ తోడికోడల్నీ కూచోబెట్టి చాకిరీ చెయ్యాలా నేనూ?! ఛస్తే చెయ్యను." అంది

అత్త, మావఁ ఉండి ఉంటే దగ్గర పెట్టుకుని సేవ చేసేదా?! నాకు తల్లీదండ్రీ లేకపోవడాన్ని పెళ్లికొడుకు ప్లస్ పాయింట్లలో ఒకటిగా మీ అమ్మాయీ, వాళ్ల అమ్మగారూ ఖచ్చితంగా లెక్కేసి ఉంటారు. మొగుడు కావాలి, మొగుడి తరఫు ఆస్తులు కావాలి... కానీ మొగుడి తరఫు ఆత్మీయులు మాత్రం ససేమిరా వద్దు. అత్తమామల్ని చూడటం కోడలి ధర్మం అని నిర్దేశించిన సమాజం, వారి స్థానంలో అంతకు మించిన ప్రేమాస్పదులున్నా సరే చూడవలసిన అవసరం లేదని గిరి గీసిందా?!

అత్తవారైనా, ఎవరైనా అవతలివారిలో ఉన్న మంచితనం గ్రహించాలంటే ముందు మన మనసు సాత్వికమైనదీ మంచిదీ అయి ఉండాలి. అవతలివారిని ప్రేమించాలంటే ముందు మనలో ప్రేమించే స్వభావం ఉండాలి. గాలి స్వచ్ఛంగా ఉంటేనే పరిమళాన్ని స్వీకరించి వెదజల్లుతుంది. దుర్గంధపూరితమైన చోట సెంటు గుమ్మరించినా గాలి దాన్ని పీల్చుకోలేదు. దుర్వాసనాపూరితంగానే ఉంటుంది. ప్రేమ అంటే కేవలం స్త్రీ పురుషుల మధ్య కలిగే వ్యామోహమేనన్న అభిప్రాయం నూటికి తొంభై మందికి ఉంది. మచ్చలేని మానవత్వమే ప్రేమ అని, రేపటితరం బావుండాలంటే ఈ తరం ఆ ప్రేమకు నీరు పోసి పోషించాలనీ మీ అమ్మాయి లాంటివారికి తెలియనే తెలియదు. అందుకే తరం మారిన కొద్దీ ప్రేమాభిమానాలు మరింతగా అడుగంటుతున్నాయి

ఉంటాను మావయ్యగారూ. "వాడు రాకపోతే పొమ్మను.. మన మానాన మనం పండగ హాయిగా చేసుకుందాం" అని ఈపాటికి మీ అమ్మాయీ, వాళ్ల అమ్మగారూ తీర్మానించేసుకుని ఉంటారు. శుభం! మీకందరికీ పండగ శుభాకాంక్షలు! నన్ను ప్రాణంగా ప్రేమించే మా అన్నయ్య, వదిన దగ్గరుంటే నాకు ప్రతి రోజూ పండగే!

అన్నట్టు, పండగ తర్వాత వారం రోజులు నేను సెలవు పెట్టాను. ఇక్కడే ఉంటాను. నమస్కారం!!

అల్లుడు వాట్సప్ లో తనకు పంపిన సుదీర్ఘమైన మెసేజ్ ని ఒకటికి నాలుగు సార్లు చదువుకున్నాడు రంగారావు. భార్య నోటికి జడిసి తను తన తల్లిదండ్రుల్ని అన్న దగ్గరకి పంపించెయ్యడం గుర్తొచ్చిందతనికి. ఇప్పుడు కూతురు మాత్రం తన మాట వింటుంది గనకనా...??!!

★★★★★★★★★★★★★★★★★★★

మర్నాడు ఉదయం పదిగంటల వేళ... "డాడీ... డాడీ" అంటూ ఆనందంగా లహరి అరుస్తుంటే ఆశ్చర్యంగా బైటికొచ్చిన పద్మ, కారు దిగి లోపలికొస్తున్న శివానంద్ ని, అతని వెనకాలే వస్తున్న బావగారినీ, తోడికోడల్నీ చూసి స్తంభించిపోయింది.

కూతురితో బాటే వచ్చిన శాంత కూడా ముందు కొయ్యబారిపోయి, క్షణంలో తేరుకుని,

ఆడంబరంగా నవ్వుతూ "రండి.. రండి" అంటూ వారిని ఆహ్వానించింది.

"బావున్నావామ్మా" మరదల్ని చిరునవ్వుతో పలకరిస్తూ లోపలికి వచ్చాడు రామానంద్.

తను తెచ్చిన బిస్కెట్ పేకెట్టు, చాక్లెట్ బార్ లహరికిచ్చి, ఆ పసిదాన్ని ముద్దాడుతూ లోపలికి వచ్చిన సీత కూడా నవ్వుతూ తోడికోడల్ని పలకరించింది.

శివానంద్ మాత్రం కూతుర్ని కూడా పట్టించుకోలేదు. ఎవ్వర్నీ పలకరించలేదు. నిశ్శబ్దంగా, యంత్రంలా నడుస్తూ వచ్చి సోఫాలో కూచున్నాడు.

మంచినీళ్లూ, కాఫీలూ అయాక నేరుగా విషయం లోకి వచ్చేశాడు రామానంద్.

"చూడమ్మా, నాకు చదువంటే అబ్బలేదు గాని, కాస్తో కూస్తో జ్ఞానం ఉంది. అనుబంధాలూ, ఆప్యాయతలూ అంతకంతకీ కుచించుకుపోవడమన్నది యుగధర్మం. తల్లిదండ్రుల్ని కావడిలో మోసిన శ్రవణకుమారుడి స్థానంలోనే, ముసలివాళ్లూ, నిస్సహాయులూ అయిన తల్లిదండ్రుల్ని వీధిలోకి పడగెంటుతున్న కొడుకులు రాలేదా?! అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య నిష్కల్మషమైన ప్రేమలూ, అభిమానాలూ ఎక్కడో ఒకటీ అరా... అంతే. ఉమ్మడి కుటుంబాలు మచ్చుకి లేవు. అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న మొగుడూపెళ్లాలే ఛీ అంటే ఛీ అనుకుంటూ పిల్లల మొహాలు కూడా చూడకుండా విడిపోతున్నారు. ఇలాంటి కలికాలంలో బావగార్నీ, తోడికోడల్నీ ఆదరించడం లేదని నిన్ను మావాడు తప్పుబట్టడమంత వెర్రితనం మరొకటి లేదు. మా కారణంగా మీరిద్దరూ గొడవలు పడటం, చెరో చోటా ఉండటం..ఇది మేం సంతోషించే విషయమేనా?! వాడికి గట్టిగా చెప్పాను. ఇక మీదట వాడు మా ఊసు ఎత్తడు. నెమ్మదిగా సర్దుకుంటాడు. నువ్వూ, వాడూ

హాయిగా కలిసీ మెలిసీ ఉంటే మాకదే పదివేలు. త్వరలోనే ఆస్తి పంపకాలు కూడా చేస్తాను. మీకు కావలసింది కొనుక్కోండి"

రామానంద్ మాటలు వింటూ మరింతగా స్తంభించిపోయింది పద్మ. మరికొన్ని గంటల్లో పట్టాభిషిక్తుడు కాబోతూ, కైక కోరిక మేరకు పట్టు పీతాంబరాల్లోంచి నారబట్టల్లోకి ఇట్టే మారిపోయి, నవ్వుతూ వనవాసానికి తరలిపోయిన రాముడు గుర్తొచ్చాడామెకి అప్రయత్నంగానే.

★★★★★★★★★★★★★★★★★★

"వదిన మీద ఒట్టు... నేనసలు నీ ఊసు ఎత్తలేదన్నయ్యా. నువ్వు చెప్పినట్టే మొహం ముడుచుకు కూచోకుండా నవ్వుతూ తిరిగాను కూడా. తనే పట్టుబట్టింది. భోగిమంట మీతోనే కలిసి వెయ్యాలంది. నేను రాకపోతే తనొక్కర్తీ పిల్లని తీసుకుని వెళిపోతానంది. అందుకే వచ్చాను."

తమ్ముడి మాటలు వింటూ ప్రశ్నార్థకంగా మరదలి వైపు చూశాడు రామానంద్.

ఒక్క అడుగు ముందుకు వేసి, వంగి బావగారి పాదాలు తాకింది పద్మ.

"నాకు వివరంగా చెప్పడం రాదు బావగారూ. చెప్పలేను. కానీ మీ మాటలు, నా దుర్మార్గాన్ని మీరు సహించిన తీరు నన్ను పదే పదే వెంటాడాయి. మీరు చెప్పింది నిజమే. ప్రేమలూ అభిమానాలూ తగ్గిపోవడం యుగధర్మమే. కానీ అవి పూర్తిగా నశించిపోకుండా చూసుకోవడం మానవధర్మమే కదా. ముఖ్యంగా లహరిలాంటి పిల్లలు భవిష్యత్తులో కనీసం మొగుడి పట్ల అయినా ప్రేమగా, అభిమానంగా ఉండటం, సర్దుకుపోవడం నేర్చుకోవాలంటే మాలాంటి పెద్దలు వాళ్లకి ఆదర్శంగా ఉండాలి. మీ మాటలతోనే ఆ నిజం గ్రహించాను. అందుకే వచ్చాను. లహరికి పెదనాన్న, దొడ్డమ్మే కాదు.. తాత, నాయనమ్మ కూడా మీరే. మాకు పెద్ద దిక్కు మీరే!!"

పద్మ మాటలతో అందరి మొహాలూ సహస్రదళ పద్మాల్లా విచ్చుకున్నాయి!!

COMMENTS